క్లుప్తంగా

గాయపడిన వారికి పరామర్శ



నూకినాయుడును పరామర్శిస్తున్న రాము

రాంబిల్లి : సాహితి ఫార్మా పరిశ్రమ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్మికులను ఆదివారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము పరామర్శించారు. విశాఖపట్నంలో కేజీహెచ్, ఇండస్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నూకినాయుడు, అప్పారావు, రామేశ్వర్, రాజుబాబులను రాము పరామర్శించారు. వీరి పరిస్థితి విషమంగా ఉందని, వీరికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అలాగే ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చేయాలన్నారు.

ఊరిస్తున్న వర్షాలు

మునగపాక : రుతుపవనాలు ఊరించడం తప్ప ప్రజలకు మాత్రం ఉపశమనం కలగలేదు. నాలుగు రోజులుగా ఎండల తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. చిరుజల్లుల జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు ఎండిపోతున్నాయంటూ వాపోతున్నారు. ఉదయం 10గంటలకే ఎండ తీవ్రత పెరిగిపోవడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. సాయంత్రం 5గంటలు కావస్తున్నా ఎండ వేడిమి తగ్గకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. జూలై మాసం మొదటివారంలో కూడా వర్షాలు కురవకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇళ్లల్లో కూడా వేడి పెరిగిపోతుండడంతో ఇబ్బందుల నడుమ సతమతమవుతున్నారు.

భారీగా తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



బైక్ ర్యాలీకి వెళ్తున్న కార్యకర్తలు

రాంబిల్లి : వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు స్వాగతం పలుకుతూ నిర్వహించిన బైక్ ర్యాలీకి రాంబిల్లి మండలం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లాయి. తూర్పు కాపు సంఘం మండల ఉపాధ్యక్షుడు ఉప్పులూరి నాయుడు, సర్పంచ్‌లు నానేపల్లి సాయి వరప్రసాద్, ముత్తా శంకర్రావు, నగిరెడ్డి వెంకటరమణతో పాటు పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు బైకులతో ర్యాలీగా అనకాపల్లి వెళ్లారు.

కోటవురట్లలో 'గడప గడపకు' నేడు

కోటవురట్ల : కోటవురట్ల సచివాలయం–2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

5న వృద్ధుల సమస్యలపై సమావేశం

అనకాపల్లిటౌన్ : జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం ఈ నెల 5న గవరపాలెం వీవీ రమణ రైతు భారతి హాల్లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సంఘం వ్యవస్థాపకులు కాండ్రేగుల అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల నుంచి 9 మంది అధికారులను, వివిధ సంక్షేమ సంఘాల నుంచి ఆరుగురు ప్రతినిధులతో నూతన కార్యవర్గాన్ని కలెక్టర్ నియమించినట్లు తెలిపారు. వృద్ధుల సమస్యలను కమిటీకి వివరిస్తే, వాటి పరిష్కారానికి కమిటీ కృషి చేస్తుందన్నారు.

50 మంది యువత రక్తదానం

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం రామాలయంలో ఆదివారం కశింకోట కాప్స్ రాక్స్ కేఎస్ఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వంగవీటి మోహన్‌రంగా జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 50 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని అభినందిస్తూ నిర్వాహకులు సర్టిఫికెట్లు అందించారు. ముందుగా రంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అర్హులందరికీ ధ్రువపత్రాలు సిద్ధం చేయాలి



దేవవరం సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో



కొరుప్రోలు సచివాలయానికి హాజరైన సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు

నక్కపల్లి : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులన్నీ సమగ్రంగా పరిశీలించి ధ్రువపత్రాలు సిద్ధం చేయాలని ఎంపీడీవో సీతారామరాజు ఆదేశించారు. ఆదివారం ఆయన దేవవరం, గొడిచర్ల, ఉద్దండపురం సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వచ్చిన దరఖాస్తులు టోకెన్లు జనరేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన దేవవరంలో జగనన్న సురక్ష గ్రామ సభ జరుగుతుందన్నారు. ఇంటింటి సర్వేలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంతో పాటు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

అర్హులైన వారికి ధ్రువపత్రాలు సిద్ధం చేయాలన్నారు. గ్రామసభకు దరఖాస్తు చేసిన వారందరినీ తీసుకువచ్చి ధ్రువపత్రాలు అందజేయాలన్నారు. కుల, ఆదాయ నివాస, జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు, వివాహ రిజిస్ట్రేషన్, కౌలు రైతు సర్టిఫికేట్లు, మ్యూటేషన్ దరఖాస్తులు, ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెలవురోజూ పనిచేసిన సచివాలయ సిబ్బంది

ఎస్.రాయవరం : గ్రామాల్లో తేదీల వారిగా నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తి విజయవంతం చేయాలని సచివాలయ సిబ్బంది ఆదివారం కూడా సచివాలయ కేంద్రాలకు పరిమితం అయ్యారు. గ్రామ వలంటీర్లు సేకరించిన దరఖాస్తులు ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

నేడు జగనన్న సురక్ష ఇలా...

తిమ్మాపురం 2, ఎస్.రాయవరం 2 సచివాలయాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో తెలిపారు. ఎంపీడీవోబృందంతో తిమ్మాపురం, తహసీల్దార్ బృందంతో ఎస్.రాయవరం లోనూ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

రెండు గ్రామాలలో జగనన్న సురక్ష నేడు

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం రెండు గ్రామాలలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. తహసీల్దారు బృందం రాజుపేటలోను, ఎంపీడీవో బృందం కోటవురట్ల–2లోను జగనన్న సురక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని సంబంధిత అధికారులతో పాటు దరఖాస్తుదారులు హాజరు కావాలని సూచించారు.

4న గణపర్తి, మెలిపాకలో జగనన్న సురక్ష

మునగపాక : మండలంలోని మెలిపాక, గణపర్తి గ్రామాల్లో ఈ నెల 4న జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే కార్యక్రమంలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మన్మథరావు కోరారు.

విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలి



పదవీ విరమణ చేసిన లైన్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహనరావు దంపతులను అభినందిస్తున్న విద్యుత్ అధికారులు

యలమంచిలి : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసినప్పుడే ఆ ఉద్యోగికి మంచి గుర్తింపు దక్కుతుందని రాష్ట్ర విద్యుత్ పూర్వపు యూనియన్ కార్యదర్శి కె.ఎం.ఎస్ పాత్రో అన్నారు. యలమంచిలి పట్టణంలో విద్యుత్ శాఖ కార్యాలయంలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా సేవలదించి పదవీ విరమణ పొందిన పి.మురళీమోహనరావును ఆదివారం యలమంచిలిలో విద్యుత్ ఉద్యోగులు సంఘం నాయకులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యలమంచిలి పట్టణంలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా సేవలందించిన మురళీ మోహనరావును యలమంచిలి మండల ఎంపీపీ బోదెపు గోవింద్ ప్రజాప్రతినిధులు సహచర ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకలు జె.ఆర్ ప్రసాద్ ఎ.నూకరాజు, చిరంజీవి, పి.ఎస్ దొర తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం కప్పల ఊరేగింపు



జంపపాలెం కప్ప కప్ప నీలాలు దేవుడి గుడిలో నీలాలు ఆడుతున్న చిన్నారులు

యలమంచిలి : వర్షాలు కురవాలని మండలంలో జంపపాలెం గ్రామంలో ప్రజలు ఆదివారం కప్పలను ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలో కప్ప కప్ప నీలాలు.. దేవుడి గుడిలో నీలాలు అని అంటూ కొంత మంది యువకులు కప్పలను కర్రకు కట్టి గ్రామంలో ఊరేగింపుగా ప్రతి ఇంటికి వెళ్లి కప్పలకు వారి చేత బిందెలతో నీళ్లు పోసి వరుణుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురవాలని వరుణదేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో ప్రజలు యువతీ యువకులు ఉత్సాహంగా నిర్వహించారు.

మూలకు చేరిన చేతిబోర్లు



యండపల్లిలో రామాలయం వద్ద మరమ్మతుకు గురైన చేతిబోరు

కోటవురట్ల: యండపల్లిలోని రామాలయం వద్ద చేతి బోరు మరమ్మతుకు గురికావడంతో స్థానికులు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండే ఎండలకు అధికారుల నిర్లక్ష్యం తోడవ్వడంతో గొంతెండిపోతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల క్రితం బోరు మరమ్మతుకు గురికాగా అధికారులు పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. వారం రోజుల క్రితం మరమ్మతు కోసం బోరు చుట్టూ తవ్వేసి వదిలేశారని చెబుతున్నారు. బోరు పనిచేయకపోవడంతో చాలా దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారున నూకాలమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఉన్న చేతిబోరు కూడా మరమ్మతుకు గురైందని అధికారులు స్పందించి రెండు బోర్లకు మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శ్రమదానంతో తుప్పల తొలగింపు



పి.ధర్మవరం గ్రామంలో శ్రమదానంతో పిచ్చితుప్పలు తొలగిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: పి.ధర్మవరం గ్రామంలో యువత శ్రమదానం చేసి వీధుల్లో పిచ్చిమొక్కలు తొలగించారు. గ్రామంలో సచివాలయం సమీపంలోనూ, పాఠశాలకు ఆనుకుని ఉన్న పలు వీధుల్లో పిచ్చితుప్పల కారణంగా పాముల భయం ఉండడంతో యువత నడుం బిగించారు. సీపీఎం నాయకుడు ఎం. అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి శ్రీనుబాబు, గ్రామస్తులు కోసూరి సత్యనారాయణ, నీలం రమణ తదితరులు సహాయ సహకారాలు అందించారు. శ్రమదానంతో యువకులు చేసిన సేవలను పలువురు అభినందించారు.

శివారు గ్రామంలో పారిశుధ్యలోపం



రామన్నపాలెంలో మట్టిరోడ్డులో మురుగు

కోటవురట్ల : రాజుపేట శివారు రామన్నపాలెంలో పారిశుధ్యలోపం పీడిస్తోంది. శివారు గ్రామం కావడంతో అధికారులు చిన్నచూపు చూస్తున్నారని, అందుకే అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు వీధుల్లో నేటికీ సీసీ రోడ్లు వేయలేదని, రాకపోకల్లో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లల్లోని వాడుక నీరంతా రోడ్లపైకి చేరి మురుగుకూపంలా తయారవుతోంది. ఏడాది పొడవునా ఇదే పరిస్థితి ఉంటోందని, వర్షాకాలంలో మరిన్ని అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరుతున్నారు.

అడ్డురోడ్డు జంక్షన్‌లో చినుకుపడితే చిత్తడి



రోడ్డుపై నిలిచిపోతున్న వర్షపునీరు

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు జంక్షన్‌లో చినుకు పడితే చిత్తడిగా మారిపోతుంది. పాత నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద వర్షం వస్తే రోడ్డు పై నీరు ప్రవహించి చిత్తడిగా మారుతోంది. నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల ముఖ్య కూడలి అయిన అడ్డురోడ్డు జంక్షన్‌కి వాహన చోదకులు, వ్యాపార లావాదేవీలు జరుపుకొనేవారు, ప్రయాణికులు నిత్యం వేల సంఖ్యలో వచ్చి వెళుతుంటారు. రోడ్డుకిరువైపులా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. పెదగుమ్ములూరు గ్రామం వైపు రోడ్డుకి డ్రైనేజీ కాలువ లేకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోందని స్థానికులు చెబుతున్నారు. వాణిజ్యపరంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జంక్షన్‌లో సమస్యల పరిష్కారంలో అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ రోడ్డు సమస్య ఎక్కువగా ఉందని 2009లో ఎమ్మెల్యేగా గెలిచిన గొల్ల బాబూరావు ఆర్అండ్‌బీశాఖ నుంచి రూ.రెండు కోట్లు కేటాయించి సిమెంట్ రోడ్డు వేయించారు. రోడ్డు సమస్య పరిష్కారం అయినప్పటికీ డ్రైనేజీ సక్రమంగా లేక వర్షం నీరు, అప్పుడప్పుడు వ్యాపార దుకాణాల్లో నుంచి మురుగు నీరు రోడ్డుపైకి వస్తుంది. దీంతో రోడ్డు చిత్తడిగా మారి వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి డ్రైనేజీలు నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

బొడ్డేడకు ఘన స్వాగతం



పాయకరావుపేట నుంచి అనకాపల్లి బయలుదేరిన నాయకులు



వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు స్వీటు తినిపించి శుభాకాంక్షలు తెలుపుతున్న అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, గ్రీవెన్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విష్ణుమూర్తి

పాయకరావుపేట : రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌ను అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడి పదవి పొందిన కారణంగా పాయకరావుపేట నుంచి పార్టీ నాయకులు అనకాపల్లి బయలుదేరారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి తాడేపల్లి నుంచి తిరుపతి వెళ్ళి, స్వామిని దర్శించుకుని ఆదివారం అనకాపల్లికి వచ్చిన బొడ్డేడ ప్రసాద్‌కు జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ చిక్కాల రామారావు ఆధ్వర్యంలో నాయకులు భారీ కారు ర్యాలీతో స్వాగతం పలికారు. పాయకరావుపేట నుంచి బయలుదేరిన వారిలో పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, మంగవరం, పి.ఎల్.పురం, గోపాలపట్నం, ఎం.ఎస్.పేట సర్పంచ్‌లు వంగలపూడి సరస్వతీ రామారావు, పడాల దివాణం, పన్నీరు బాబ్జి, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, పాయకరావుపేట పీఏసీఎస్ ఛైర్మన్ దేవవరపు రాజేష్‌ఖన్నా, ఏసీ నాయకులు నెలపర్తి నాగరాజు, సలికే అచ్చియ్య, జొన్నకూటి సూరిబాబు, పంచాయితీ వార్డు మెంబర్లు కొప్పిశెట్టి మోహన్, తుమ్మలపల్లి సతీష్ పట్టణ యూత్ అధ్యక్షుడు పిరాధి రాజు తదితరులు బొడ్డేడకు స్వాగతం పలికారు.

నక్కపల్లి : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి అనకాపల్లి వచ్చిన బొడ్డేడ ప్రసాద్‌కు స్వాగతం పలికేందుకు నక్కపల్లి నుంచి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం తరలివెళ్లారు. పార్టీ నాయకులు శీరం నర్సింహమూర్తి, బొల్లం బాబ్జి, శేషారత్నం, గొర్ల నర్సింహమూర్తి, నాగ అప్పలరాజు, యలమంచిలి తాతబాబు తదితరుల ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు అనకాపల్లి తరలి వెళ్లారు.

అచ్యుతాపురం మండలం నుంచి...

అచ్యుతాపురం(అనకాపల్లి): వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన బొడ్డేడ ప్రసాద్‌కు ఘనంగా స్వాగతం పలికేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆదివారం ఉదయం మండలం నుంచి భారీగా తరలివెళ్లాయి.డీసీసీబీ మాజీ ఛైర్మన్ సుకుమార వర్మ నేతృత్వంలోని పార్టీ నాయకులు అచ్యుతాపురం మండలం నుంచి ద్విచక్రవాహన శ్రేణితో బయలుదేరి అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు.ఈ కార్యక్రమాల్లో మండలానికి చెందిన పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు తరలివెళ్లారు.

ఎస్సీ సెల్ అధ్యక్షురాలు అభినందన

మునగపాక : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌ను ఆదివారం అనకాపల్లి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లోచల సుజాత మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రసాద్‌కు జిల్లా పార్టీ పదవి అప్పగించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేస్తూ దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు,అరబుపాలెం మాజీ సర్పంచ్ లంబా అప్పారావు పాల్గొన్నారు.

తోటాడలో ఘనంగా గిరి ప్రదక్షిణ



విశాఖలో గిరి ప్రదక్షిణలో మునగపాకకు చెందిన పెంటకోట రామయ్య కుటుంబ సభ్యులు



తోటాడలో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మునగపాక : మండలంలోని తోటాడలో ఆదివారం గిరి ప్రదర్శన కార్యక్రమం ఘనంగా జరిగింది. తోటాడలోని శ్రీ ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఓంకార పీఠం నుంచి భక్తులు భజనలు చేస్తూ త్రిమూర్తుల ఆలయం, పాటిపల్లి కాలనీ, వరాహ నరసింహ స్వామి ఆలయం, నారాయుడుపాలెం మీదుగా ఓంకార పీఠం వరకు ఊరేగింపు నిర్వహించారు. కాగా సోమవారం ఆలయ ప్రాంగణంలో గురు పౌర్ణమి సందర్భంగా భారీ అన్న సమారాధన జరుగుతుందని మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుకుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా మునగపాకకు చెందిన పెంటకోట రామయ్య కుటుంబ సభ్యులు గిరి ప్రదక్షిణలో భాగంగా విశాఖలో భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టారు.

గురు పౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి



గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబైన యలమంచిలిలో సాయిబాబా మందిరం

యలమంచిలి : గురు పౌర్ణమి సందర్భంగా యలమంచిలి పట్టణంలో కాంప్లెక్స్ వద్ద ఉన్న సాయిబాబా మందిరంను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. యలమంచిలి పట్టణం, మండలంలో అన్ని గ్రామాల్లో సాయిబాబా మందిరాలను విద్యుత్ పూలదండలతో ఆలయాలు ముందు టెంట్‌లు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఉత్తమ విద్యార్థులకు ఉపకారవేతనాలు

అనకాపల్లిటౌన్ : విద్యార్థి దశ నుంచి ప్రణాళికాయుతంగా ఇష్టపడి చదువుకోవాలని మాజీ మున్సిపల్ ఛైర్మన్, గౌరీ సేవాసంఘం మాజీ అధ్యక్షుడు మళ్ల సాంబశివరావు అన్నారు. గవరపాలెంలోని కొణతాల సుబ్రహ్మణ్యం ఏసీ హాల్లో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2023 వరకూ ఉత్తమ మార్కులు సాధించిన వారికి ఉపకారవేతనాలు అందించడం ఆనందంగా ఉందన్నారు. కరోనా విపత్తుల కారణంగా నేటి వరకూ ఉపకార వేతనాలు విద్యార్థులకు అందజేయలేకపోయినట్టు పేర్కొన్నారు. టెన్త్ ఆపై తరగతుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 200 మందికి రూ.10 లక్షల ఉపకారవేతనాలు అందించారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- కశింకోట మండలంలో 892 హెక్టార్ల సాగు అంచనా
- అందుబాటులో 620 క్వింటాళ్ల వరి విత్తనాలు

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. సాగు జలాశయాలు కూడా దాదాపు నిండుకుండల్లా ఉన్నాయి. దీంతో సాగు విస్తీర్ణం ఏడాదికేడాది పెరుగుతోంది. ప్రధానంగా వరి సాగుపై రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. చెరకు సాగు భూముల్ని కూడా వరి సాగుకు మళ్లిస్తున్నారు. ఈ ఏడాది కూడా కశింకోట మండలంలో గతం కంటే ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు జరగనుందని వ్యవసాయ అధికారుల అంచనా.



నారుమళ్లు వేయడానికి దుక్కి దున్ని సిద్ధం చేసిన పంట భూమి

కశింకోట : మండలంలో ఖరీఫ్ వరి సాగుకు రైతాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే నారుమళ్లు వేయడానికి పలుచోట్ల భూములను దున్ని సిద్ధం చేశారు. మరికొందరు క్రిమి కీటకాలు, గడ్డి నశించేలా దుక్కు పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో ప్రధానంగా వరి, చెరకు పంటలను ఎక్కువగా పండిస్తారు. వీటిలో రెండో స్థానంలో ఉండే వరి గత మూడేళ్లుగా అగ్రస్థానంలో నిలుస్తోంది. ఈ ఏడాది మండలంలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 892 హెక్టార్లుగా అధికారులు నిర్ణయించారు.

మూడేళ్లుగా పెరుగుతున్న వరి సాగు

మండలంలో 2020 సంవత్సరం నుంచి సాధారణ విస్తీర్ణాన్ని మించి వరి పంట సాగవుతోంది. అంతకు ముందు చెరకు పంట ప్రథమ స్థానంలో ఉండేది. బెల్లానికి గిట్టుబాటు తగ్గడం, చెరకు పంటకు ఎర్రకుళ్లు తెగులు, పసుపాకు తెగులు ఆశించి దిగుబడి, ఎదుగుదల గణనీయంగా తగ్గి నష్టం కలిగిస్తోంది. చెరకును కొనుగోలు చేసే తుమ్మపాల సుగర్ పరిశ్రమ మూతపడటం వంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా వరి సాగుపై రైతులు దృష్టి సారించారు. 2020లో వరి సాధారణ విస్తీర్ణం 818 హెక్టార్లు కాగా, 914 హెక్టార్లలో సాగు జరిగింది. 2021లో 833 హెక్టార్ల సాధారణ సాగుకు, 979 హెక్టార్లు, 2022లో 819 హెక్టార్లకుగానూ 1,133 హెక్టార్లలో వరి పంట వేశారు. దీంతో ఈ ఏడాది కూడా వరి సాగు విస్తీర్ణం గతం కంటె పెరుగుతుందని అధికారుల అంచనా.

వర్షాధారంగానే వరి సాగు

మండలంలో ఎక్కువగా వర్షాధారంగానే పంటలు పండిస్తారు. ఖరీఫ్ వరి అయితే దాదాపు వరుణుడిపైనే భారం. శారదానదిపై ఆనకట్టల నుంచి కాలువల ద్వారా వచ్చే సాగునీరు, చెరువుల నీరు కూడా వరి సాగును ప్రోత్సహిస్తున్నాయి. సొంత బోరు, మోటారు సదుపాయం ఉన్న కొందరు బోరు నీరుతో సాగు చేస్తారు. సాధారణంగా జూలై నెల నుంచి నారుమళ్లు పోసి నాట్లు వేస్తారు. కన్నూరుపాలెం, చెరకాం, తీడ, సుందరయ్యపేట తదితర గ్రామాల్లో బోర్లు, మోటార్ల సాయంతో ముందుగానే పంట వేస్తారు.

మిగిలిన గ్రామాల్లో వర్షాధారంతో పంట సాగు చేస్తారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండటంతో పంట భూముల్ని దున్ని, నారుమళ్లు వేసే పనిలో రైతులు బిజీ అయ్యారు.

ఆర్జీఎల్ రకం విత్తనాలపై మొగ్గు

మండల వ్యవసాయ సిబ్బంది భూ పరీక్షల నిర్వహణకు గ్రామాల వారీగా 345 నమూనాలను సేకరించారు. మండలంలో భూములకు ఆర్జీఎల్ వరి రకం సాగుకు అనుకూలంగా ఉండటంతో రైతులు వాటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు అనుగుణంగా అధికారులు కూడా ఆర్జీఎల్ రకం విత్తనాలను రాయితీపై అందించేందుకు చర్యలు తీసుకున్నారు. మండలంలోని 19 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆర్జీఎల్‌తో పాటు సాంబమసూరి, సోనామసూరి తదితర రకాలకు చెందిన 620 క్వింటాళ్ల విత్తనాలను, విత్తన శుద్ధి మందును సిద్ధం చేశారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ద్వారా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు.